

ఉదయం 6గంటలకు రాయల్ కౌంటీలో స్విమ్మింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

ఉత్సాహం.. వరద

Sunday Special

ఆయన జిల్లాలో ఇప్పుడున్న రాజకీయ నేతల్లో సీనియర్ మోస్టు నాయకుడు. వరుసగా ఐదుసార్లు ఎన్నికల్లో గెలిచి 25 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన రాజకీయ దురంధరుడు. 1985 నుంచి 2009 వరకు తన రాజకీయ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్న ఆయన అనంతరం వరుసగా రెండుమార్లు శిష్యులు లింగారెడ్డి, రాచమల్లు చేతుల్లో ఓటమి పాలయ్యారు. మూడోసారి టికెట్టు దక్కక పోటీలో లేరు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యే పదవికి దూరమైనా.. తిరిగి ఇప్పటి రాజకీయాల్లో సత్తా చాటి 82 ఏళ్ల వయసులో ఎమ్మెల్యేగా గెలుపొంది మళ్లీ ప్రొద్దుటూరు ప్రజల ఆదర అభిమానాలు పొందారు. 82 ఏళ్ల వయసులో 28 ఏళ్ల యువకుడిలా ఉత్సాహంగా ఉండే రాజకీయ ఉద్దండుడు నంద్యాల వరదరాజులరెడ్డి జీవన శైలి, ఆయన బాల్యం నుంచి ఎదిగిన క్రమం గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో సత్సంగంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

- ఆరుసార్లు ఎమ్మెల్యే
- అయినా జొన్నరొట్టే ఆహారం
- పల్లె వదిలి పట్టణం రాని వైనం
- తెల్లవారుజామున 3.45కే దినచర్య ప్రారంభం
- రోజూ ధ్యానం, ఈత తప్పనిసరి
- ఇదీ 82 ఏళ్ల ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దినచర్య

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 14: బాల్యంలో తన తండ్రి పెద్ద వరదారెడ్డి నేర్పిన క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్నే 82 ఏళ్ల వయస్సులోనూ ఇంకా కొనసాగిస్తున్నారు. అందరూ పల్లెలు వొదిలి పట్టణాల్లో బంగ్లాలు కట్టుకుని జీవిస్తుంటే ఆయన నేటికీ తన స్వగ్రామం కామనూరులోని రాధా నగర్‌లోనే నివాసం ఉంటున్నారు. పల్లెలోనే పచ్చటి వాతావరణం మధ్య ఆహ్లాదంగా కాలుష్యరహితంగా జీవనం సాగిస్తున్నారు. ఎలాంటి ఆడంబరాలు లేకుండా ఆయన జీవన శైలి చాలా సాదాసీదాగా సాగుతోంది. తన జీవన విధానం గురించి ఆంధ్రజ్యోతితో ఆయన ముచ్చటించారు.

బడి ఎగ్గొట్టి ఆటలకు వెళ్లేవాడిని

బాల్యంలో ప్రైమరీ స్కూలు కామనూరులో చదువుకున్నాను. ఆ తరువాత ప్రొద్దుటూరు అనిబిసెంట్ హైస్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివాను. ప్రొద్దుటూరులో నా చదువు కోసం మానాన్న వరదారెడ్డి ఇల్లు తీసి అందులో మా జేజిని నాకు తిండి వండి పెట్టడానికి పెట్టి చదివించాడు. కానీ నేను బడి ఎగ్గొట్టి పావురేన్ల ఆటలకు, పెన్నానదిలో ఈత కొట్టేందుకు, చెడుగుడు ఆడేందుకు వెళ్లేవాడిని. బడి ఇడిసే సమయానికి ఇంటికి వెళ్లేవాడిని. చదువంటే ఇష్టముండేది కాదు. అందువల్లే నేను ఎస్ఎస్ఎల్‌సీ ఫెయిల్ అయ్యాను. చదువు విలువ ఇప్పుడు తెలస్తోంది.

ఎంవీ రమణారెడ్డి నేనూ కలసి చదువుకున్నాం

బాల్యంలో నాకు మంచి మిత్రులు ఉండేవారు. వారిలో వంకదార వీరభద్రయ్య, ఖాజామోహిద్దీన్, అబ్దుల్ ఖాదర్ లతీఫ్, రంతూ, ఎరికలరెడ్డి, జింకా చెంద్రాయుడు ఉండేవారు. అలాగే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి కూడా నాతోపాటు చదువుకున్నాడు. నేను బి సెక్షన్‌లో ఉంటే రమణా రెడ్డి సి సెక్షన్‌లో ఉండేవాడు. మున్సిపల్ హైస్కూల్లో నాకు బాగా ఇష్టమైన గురువు బోరెడ్డి సారు. ఆయన లెక్కల సారు. శిష్యుల పట్ల చాలా ప్రేమపూరితంగా ఉండేవారు. ఇంకా సేతురామయ్య, ముక్కమాళ్ల సుబ్బారావు, సూర్యప్రకాశరావు, వంకం సుబ్బన్న కిద్వాయ్, డేవిడ్ సార్ సుమిత్రమొసెస్‌లు కూడా మాకు గురువులుగా విద్యాబుద్ధులు నేర్పారు.

సాలు సొట్టపోతే సోలకాలతో కొట్టాడు

ఎస్ఎస్ఎల్‌సీ ఫెయిల్ కావడంతో మా తండ్రి వరదారెడ్డి చండశాసనుడుగా మారి మజ్జిగ కవ్వం చిలికే తాళ్లతో నన్ను తీవ్రంగా కొట్టాడు. చదువుకు పనికిరానని సేద్యానికి దింపాడు. సాలు దున్నేటప్పుడు సొట్టపోతే సోలకాలతో కొట్టాడు. నాలో భయాన్ని పోగొట్టేందుకు రాత్రి వేళ గొర్ల కాపలాకు పంపేవాడు. నన్ను ఊరికే ఉంచకుండా పనిచెప్పాలని చెప్పి రాధానగర్ నుంచి కామనూరు వరకు పంపి అక్కడ ఉండే వారిని పిలుచురమ్మని చెప్పేవాడు. దీంతో రాత్రి పూట సైతం ఆ దావల్లో కామనూరుకు వెళ్లి మనుషులను పిలుచుకు వచ్చేవాడిని. అలా నాలో ఏ పనినైనా చేయగలననే నమ్మకం కలిగించాడు మా నాయన. ఆ తరువాతే నాకు వ్యవసాయం మీద మక్కువ పెరిగింది.. అలా కష్టపెట్టినాడు కాబట్టే నాకు జీవితం విలువ తెలిసింది. ఆ క్రమశిక్షణ కూడా నాకు మా తండ్రి నుంచి అలవడింది. ఆ తరువాత 1981 వరకు రెడ్డిపని చేశాను.

గుర్రపు స్వారీ..

నాకు గుర్రపు స్వారీ అంటే ఇష్టం. ఖాజీపేట దగ్గర సూర్యనారాయణ అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయన వెంట నేను గుర్రపు పందేలకు వెళ్లేవాడిని. ఆయన దగ్గర ఉన్న గుర్రాలు నాకు ఇచ్చేవాడు. నేను గుర్రపు స్వారీ పల్లెలో చేసేవాడిని. ఒకసారి గుర్రపు స్వారీ చేస్తూ కింద పడ్డాను. నాకెందుకో మొదటి నుంచి ఫ్యాను గాలి పడదు. అందుకే ఎప్పుడూ ఫ్యాను వేసుకోను. అయితే ఏసీలు వచ్చాక వాటికి మాత్రం అలవాటు పడ్డాను.

సమితి ప్రెసిడెంటుగా..

రాజకీయ జీవితంలో మొదట సమితి ప్రెసిడెంట్‌గా పోటీ చేశాను. అప్పుడు నా బాల్య మిత్రుడు కదా అని ఎంవి రమణారెడ్డిని సహాయం అడిగాను. ఆయన నీకే చేస్తానని చెప్పి రఘురామిరెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాడు. నాకు అప్పటి నుంచి రాజకీయాలపై పట్టుదల పెరిగింది. చిన్నప్పటి నుంచి పాణ్యం ఎర్ర మునిరెడ్డి వర్గంలో ఉంటూ రాజకీయాల్లో తిరిగేవాడిని. అప్పటి నుంచి ఫ్యాక్షన్ రాజకీయాలతో భయాందోళనలో ఉన్న ప్రొద్దుటూరు ప్రజలకు భరోసా కల్పించడం కోసం రోజు ప్రొద్దుటూరుకు వెళ్లి వివిధ వర్గాలను కలిసి అండగా ఉండేవాడిని. హోమస్ పేటలో ఇల్లు తీసుకుని అక్కడే అన్నం వండుకొని తినేవాళ్లం. తిరిగి సాయంత్రం కల్లా కామనూరు చేరేవాడిని. 1983లో మొదటి సారి ఇండిపెండెంట్‌గా ఎంవీ రమణారెడ్డిపై ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయాను. ఆ తరువాత 1985లో టీడీపీ టిక్కెట్‌పై రమణారెడ్డిపై ఎమ్మెల్యేగా గెలిచాను. అక్కడి నుంచి నేను ఇంక తిరిగి చూడలేదు. 1989 నుంచి 2004 వరకు కాంగ్రెస్ టిక్కెట్‌పై వరుసగా గెలిచాను.

రోజువారీ దినచర్య:

తెల్లవారుజామున 3.45 గంటలకు నిద్రలేచి సత్సంగంలో కుటుంబసభ్యులతో పాటు పాల్గొంటా. సత్సంగంలో భాగంగానే చిన్నపాటి వ్యాయామం, యోగా చేస్తా. అనంతరం 5.45 గంటలకు జమ్మలమడుగు రోడ్డులోగల రాయల్‌కౌంటీలోని స్విమ్మింగ్‌పూల్‌కు వెళతా. అక్కడ గంటకు పైగా స్విమ్మింగ్ చేస్తా. తిరిగి 7 గంటలకు పల్లెకు చేరుకుని పేపర్ చదువుతా. ఉదయాన్నే నన్ను కలవడానికి వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటా. వారికి అవసరమైన సహాయంపై వెంటనే స్పందిస్తా.

మా నాయన రాధాస్వామి భక్తుడు

ఆనాడు రేనాటి పల్లెల్లో సాయంత్రం అయితే పెనాలు పెట్టి రొట్టెలు కాల్చేవాళ్లు. 50 ఏళ్ల కిందటే వరిధాన్యం వచ్చింది. అప్పటి వరకు జొన్న రాగి కొర్రలు మాత్రమే తినేవాళ్లం. మా తండ్రి పెద్ద వరదారెడ్డి స్వాతంత్ర్యం రాకమునుపే దయాల్బాగ్‌లోని రాధా స్వామి భక్తుడు. ఆయన రాధా స్వామి సత్సంగ సంప్రదాయం నుంచి మానవ జీవన విలువలను పాటించడం నేర్చుకున్నాడు. కష్టపడి సంపాదించే దాంట్లోనే బతకాలని, శక్తి వచ్చేదానికి మాత్రమే తిండితినాలని.. తినేదానికే బతకవద్దని సూచించిన జీవన మార్గం నేటికీ అనుసరిస్తున్నా. తక్కువ డబ్బుతో అలవాటు పడి బతికితే ఎక్కువ డబ్బు అవసరం ఉండదు. ఎక్కువ డబ్బుకు అలవాటు పడితే జీవితంలో అనేక తప్పులు చేయాల్సి వస్తుందనే జీవన సూత్రాన్ని నమ్ముతాను.



కుటుంబమంతా శాకాహారులే..

చిన్నప్పటి నుంచి మా కుటుంబంలోని వారంతా శాకాహారులే. రాగి సంగటి, జొన్న సంగటి, కొర్ర బువ్వ, వరిబువ్వ రొట్టెలు మా ఆహారం. మారిన కాల పరిస్థితుల్లో కూడా రుచులతో తినడం కంటే కూడా సంప్రదాయక వంటకాలంటేనే ఇష్టం. మా ఇంట్లో ఇప్పటికీ అవే వండుతారు.



స్విమ్మింగ్ చేసిన అనంతరం అనుచరులతో కలిసి ఉత్సాహంగా వెళుతున్న వరద

పెద్దాయన పేరు.. ఇలా వచ్చింది

ఆ రోజుల్లో ప్యాంట్లు వేసుకోని ఉండే వారిని సార్ అని పిలిచేవారు. నేను మొదటి నుంచి గ్రామీణ వేషధారణలో గోసపంచ, చొక్కాతో ఉండే వాడిని. నా వేషధారణతో పాటు నా వ్యక్తిత్వం వల్ల కూడా నన్ను పెద్దాయనగా ప్రొద్దుటూరు ప్రజలు పిలుస్తూ వచ్చారు.

ఎప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో..

ప్రొద్దుటూరులో నేను రాజకీయాలు మొదలు పెట్టినప్పటి నుంచి నెహ్రూరోడ్డులో పార్టీ కార్యాలయం పెట్టాను. నా దినచర్య ప్రతి రోజు పార్టీ కార్యాలయానికి వచ్చి కార్యకర్తలకు అందుబాటులో ఉండటం. ఇది నలభై ఏళ్లుగా సాగుతా ఉంది. అసెంబ్లీ సమావేశాలుంటే తప్ప నేను ఎప్పుడు కార్యకర్తలకు అందుబాటులో ఉండేవాడిని. నేను వరుసగా 25 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉండటం వలన పార్టీ కార్యాలయం ఎమ్మెల్యే ఆఫీసుగా మారింది.

నా రాజకీయ అండ వైఎస్సార్..

నేను రాజకీయాలు మొదలు పెట్టినప్పటి నుంచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాకు అండగా వుండేవాడు. ఆయన మరణించే వరకు ఆయనతో కలిసి చాలా కాలం ప్రయాణించాను.

పిల్లలను ఓబులమ్మ సగదీడింది..

నలభై ఏళ్లకు పైబడి రాజకీయాల్లో ఉండే నేను ఏనాడు ఇంట్లో పిల్లల పెంపకం విషయం పెద్దగా పట్టించుకోలేదు. వారికి ఫీజులు చెల్లించడం వారిని ప్రొద్దుటూరులో కాలేజీల వద్ద విడిచిపెట్టడం చేసేవాడిని. నా అర్ధాంగి ఓబులమ్మనే పిల్లలను బాగా సగదీడింది. ఇంటికి వచ్చేవారికి ఎప్పుడూ విసిగించుకోకుండా వండి పెట్టేది. ఏనాడు మా దాంపత్య జీవితంలో పొరపొచ్చాలు లేవు. ఆమెతో కలిసి ఇప్పటికీ కుటుంబమంతా ఎంతో ఆనందంగా జీవిస్తున్నాం.



కువైత్‌లో చిక్కుకొన్న మహిళకు లోకేశ్ హామీ



నిమ్మనపల్లి, సెప్టెంబరు 14: ఆర్థిక ఇబ్బందుల కారణంగా కువైత్‌లో ఇబ్బందులు పడుతున్న షైమూన్‌ను ఇండియాకు రప్పించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ హామీ ఇచ్చారు. కువైత్‌లో తాను పడుతున్న కష్టాలను ఆమె సోషియల్ మీడియా, ఆంధ్రజ్యోతి పత్రిక ద్వారా తనను ఈ నరకం నుంచి కాపాడాలంటూ గత నెల 27న మంత్రి లోకేశ్‌ను వేడుకొన్న సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. బాధిత మహిళను కాపాడి, ఇండియాకు తీసుకొస్తామంటూ హామీ ఇచ్చారు. శనివారం బాధితురాలు కుమారుడు సయ్యద్‌బాషా మాట్లాడుతూ నారాలోకేశ్ కార్యాలయం నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, తన తల్లిని కాపాడి అతి త్వరలో నిమ్మనపల్లికు చేర్చనున్నట్లు తెలిపారు. అలాగే తన తల్లితో ఫోన్ చేసి మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారని, తమ కుటుంబం తరఫున లోకేశ్ అన్నకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

రిమ్స్ నర్సుల నిరసన

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 14: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో కాంట్రాక్టు విధులు నిర్వహిస్తున్న నర్సులు శనివారం సెవెన్‌రోడ్స్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో నెం115తో తమ ఉద్యోగాలకు భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 12 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నా తమను రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వాలు మోసం చేశాయన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో అయినా తమకు సరైన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 16వతేదీ వరకు అత్యవసర విధులు మినహాయించి ఓపీ విధులు సాధారణ విధులు బహిష్కరించి రిలే దీక్షల్లో పాల్గొంటామని తెలిపారు. 17 నుంచి సాధారణ విధులతో పాటు అత్యవసర విధులు రెండు గంటల పాటు బహిష్కరిస్తామన్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకుంటే 18న రాష్ట్రవ్యాప్తంగా సాధారణ విధులతో పాటు అత్యవసర విధులు కూడా బహిష్కరించి నిరవధిక దీక్షల్లో పాల్గొంటామని హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి జీవో నెం.115 రద్దుచేయాలని, లేదంటే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్రప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో సర్వజన ఆసుపత్రి కాంట్రాక్ట్ నర్సులు కమాల్‌బీ, జయశ్రీ, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రిమ్స్ నర్సులు

లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప (రూరల్), సెప్టెంబర్ 14: నేషనల్ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవడం వలన సత్వర న్యాయం పొందడంతో పాటు డబ్బు, సమయం ఆదా చేసుకోవచ్చని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో శనివారం నేషనల్ మెగా లోక్‌అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారం అయితే అది సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అపీల్‌కు వెళ్లడానికి వీలుపడదన్నారు. లోక్‌అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం చేసుకోవడం వలన వాణిజ్య, వ్యక్తిగత సంబంధాలు చెడవన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.దినబాబు వివిధ కోర్టుల జడ్జిలు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, బెంచ్ మెంబర్లు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



నేషనల్ మెగా లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

3200 కేసులకు అవార్డులు

లోక్‌అదాలత్‌కు వచ్చిన కేసుల పరిష్కారానికి ఉమ్మడి కడప జిల్లాలో 23 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లా కోర్టులో 6 బెంచీలను ఏర్పాటు చేయగా రాయచోటిలో 4, ప్రొద్దుటూరులో 2, రాజంపేటలో 2, బద్వేల్‌లో 2, పులివెందుల, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, నందులూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురంలలో ఒక్కొక్క బెంచీని ఏర్పాటుచేశారు. వీటన్నింటిలో శనివారం నిర్వహించిన నేషనల్ మెగా లోక్ అదాలత్‌లో 3200 కేసులను పరిష్కరించి అవార్డులు ఇచ్చారు. ఇందుకు రూ.6,24,18,818 చెల్లించారు. జిల్లా కోర్టులోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో లోక్‌అదాలత్‌లో రోడ్ యాక్సిడెంట్ కేసుకు రూ.1.20 కోట్లు చెల్లింపు చేశారు. ఈ మేరకు సంబంధిత చెక్కును జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి బాధితురాలు క్రిష్ణవేణికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తన భర్త రోడ్ యాక్సిడెంట్‌లో చనిపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించానన్నారు. ఈమేరకు ఎంవీఓపీ నంబర్ 296/2019, బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తరుపు న్యాయవాదులు జాతీయ లోక్ అదాలత్‌తో సంప్రదింపులు జరిపి పై నష్టపరిహారాన్ని అందజేశారన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు అమ్మకండి : ఎస్పీ



కడప (క్రైం), సెప్టెంబరు 14: జిల్లాలో గంజాయి విక్రయాలపై దాడులు ముమ్మరం చేయడంతో గంజాయికి అలవాటు పడ్డ యువత మత్తు కలిగే మందుల కోసం మెడికల్ షాపులకు వచ్చే అవకాశం ఉందని.. ఎట్టి పరిస్థితుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా వారికి మందులను విక్రయించవద్దని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మెడికల్ షాపు నిర్వాహకులకు సూచించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారికి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే మందులు ఇవ్వరాదన్నారు. జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి మాట్లాడుతూ నార్కోటిక్స్ అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందన్నారు. యువత బాగున్నప్పుడే దేశభవిత బాగుంటుందని మనమందరం సమష్టిగా కృషి చేసినప్పుడే సాధ్యమవుతుందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.వెంకటరాముడు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల శారీరకంగా మానసికంగా కలిగే అనర్థాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణరావు, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రమాకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటకుమార్, హేమకుమార్, డీఎస్‌సీసీ బృందంలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ అందరి బాధ్యత : కలెక్టర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 14: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం అందరి బాధ్యత అని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పిలుపు నిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా రాజీవ్‌మార్గ్ నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవ హారం నిర్వహించి స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీని కలెక్టర్, ఎమ్మెల్యే ఆర్.మాధవి సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబరు 1 వరకు జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో, గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తు తరాల కోసం ఆరోగ్యమైన సమాజం అందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. అనంతరం స్థానిక నాగరాజుపేట, నారాయణ కాలేజీకి సమీపంలో ఉన్న బుగ్గవంక బ్రిడ్జిని, వంకను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్‌లో ఆపరేషన్ బుగ్గవంక పేరుతో బుగ్గవంకను ఆధునీకరిస్తామన్నారు. అందులో చెత్త, పిచ్చిమొక్కలు తొలగించి సాఫీగా నీళ్లు వెళ్లేటట్లు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, నగర ఇన్‌చార్జి కమిషనర్ రాకేశ్‌చంద్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, అధికారులు ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసుల రెడ్డి, నేత గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడపలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యే తదితరులు

కాల్వకు 'గంగ' సాగేనా





సాగర్‌లో నీరున్నా... కాల్వల్లో శూన్యమున్నా సర్వేలతో సరి - నిర్మాణాలు ఎప్పుడు మరి కుందూ పనులు ఎత్తిపోతలేనా ?

అట్లూరు వద్ద అసంపూర్తిగా ఉన్న తెలుగుగంగ కాల్వ

చుక్కనీరు లేక వెలవెలబోతున్న రెడ్డిచెరువు

అట్లూరు, సెప్టెంబరు 14: ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల తలరాతలు మారడంలేదు. తెలుగుగంగ కాల్వ పనులు పూర్తికాకపోవడంతో చెరువులకు నీరు నింపలేకున్నారు. ఫలితంగా రైతుల కళ్లల్లో కన్నీళ్లు తప్ప మరేమీ మిగలడంలేదు. పనులు పూర్తి కాకపోవడంతో బ్రహ్మంసాగర్‌లో నీరున్నా చెరువులకు చేరలేదు. అయితే కుందూ నది లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు 2019లో టెండర్లు జరిగినా ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఐదేళ్లుగా సర్వేలతోనే సరిపుచ్చుతున్నారే తప్ప భూసేకరణ పూర్తికాకపోవడం, నిర్మాణంలో చొరవలేక పనులు సాగడంలేదు. ఈ పనులు జరిగితే కనీసం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో 8 టీఎంసీల నీరు నిల్వ ఉంచుకునే అవకాశం కలుగుతుంది. వైసీపీ ప్రభుత్వంలో ఆగమేఘాలపైన పనులు చేపడతామని ఆర్భాటపు ప్రకటనలు చేసిందేతప్ప ఆచరణ శూన్యమని ఈ పనులే చెబుతున్నాయి. వివరాల్లోకెళితే....

అట్లూరు మండలంలోని తెలుగుగంగ కాల్వ పూర్తి కాక చెరువులకు నీరు నింపక రైతుల కళ్లల్లో కన్నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. తెలుగుగంగ కుడి కాల్వకు పక్కనే వెంకటశెట్టిపల్లె చెరువు, రాజుపాలెం చెరువు, ఎర్రబల్లె చెరువు, లింగాల కుంట చెరువు, కుంభగిరి యాదాళ్ల చెరువు, కొండూరు వద్ద వరాయంవరాన లకుంట, ఎర్రచెరువు, రెడ్డిపల్లెవద్ద రెడ్డిచెరువు, అట్లూరు వద్ద కొత్తచెరువులకు మూడేళ్లగా తెలుగుగంగ నీరు చెరువుకు చేరలేదు. ఎడమ కాల్వకు కమలకూరు, మన్యంవారిపల్లె, మాడపూరు, కామసముద్రం, వేములూరు, ముతుకూరు గ్రామాల చెరువుకు నీరందక తెలుగుగంగ కాల్వ పూర్తి కాక చెరువుల్లో నీరు నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కుడికాల్వ పక్కనే ఉన్న 11 చెరువులకు ఎడమ కాల్వకు 6 చెరువులకు దాదాపు 3వేల ఎకరాలు అసైన్డ్‌భూములు, పట్టా భూములున్నాయి. ఎస్సీ ఎస్టీ, బీసీ, ఓసీ, బడుగు, బలహీన వర్గాల రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వర్షాధార పంటలం వేసి సాగు చేసే రైతులే ఎక్కువ మంది. రూ.11 కోట్లతో వైసీపీ ప్రభుత్వంలో కంట్రాక్టర్ 2002లో కుడికాల్వ పనులు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు పనులు పూర్తి చేయక అసంపూర్తిగా ఉండడంతో బ్రహ్మంసాగర్‌లో నీరున్నా తెలుగుగంగ కాల్వకు నీరు సాగే పరిస్థితి లేదు. కంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే బిల్లులు సక్రమంగా రావడంలేదని ఇంకా రెండు నెలల్లో పనులు పూర్తి అవుతాయని చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా చెరువులకు చుక్క నీరు చేరకపోవడంతో ఖరీఫ్‌లో భూములు సాగుకు నోచుకోలేదు. రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం పెద్దలు, అధికారులు స్పందించి త్వరితగంగా కాల్వ పనులు పూర్తి చేసి నీరు చెరువులకు అందించాలని అట్లూరు మండల రైతులు కోరుతున్నారు.



కాల్వకు అడ్డంగా పోసిన మట్టిని తొలగించని కాంట్రాక్టర్

సర్వేలతోనే సరి.. నిర్మాణాలు ?

పోరుమామిళ్ల, సెప్టెంబరు 14: వెలుగొండ ద్వారా కాకుండా కుందూనది లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా బ్రహ్మంసాగర్‌కు నీటిని సరఫరా చేస్తే నాలుగు నెలలకు ముందే రైతులకు నీరివ్వవచ్చు. ఈఉద్దేశంతోనే వైసీపీ ప్రభుత్వం కుందూనది వద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.419 కోట్లు నిధులు కేటాయించింది. అయితే 2019లో టెండర్లు జరిగినా ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఐదేళ్లుగా సర్వేలతోనే సరిపుచ్చుతున్నారే తప్ప భూసేకరణ పూర్తి కాలేకపోయింది. దువ్వూరు మండలం నేలటూరు వద్ద 2019 డిసెంబరు 23న ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. ఇంత వరకు నిర్మాణానికి నోచుకోకపోవడం అప్పటి పాలకుల నిర్లక్ష్యమేనని చెప్పుకోవచ్చు. నాలుగు రోస్టర్‌లకు సంబంధించి 2.2 డైపై పులైను, 5.545 కి.మీ పైపులైను ఫస్ట్‌ఫేస్‌లో 4.995, సెకండ్ కేటగిరీలో ప్లస్ 550 కి.మీ పైపులైను వేసేందుకు అంచనా రూపొందించారు. జొన్నవరం వద్ద పంప్‌హౌస్, నీలాపురం వద్ద మరో పంప్ హౌస్ నిర్మించి దాదాపు 8 టీఎంసీల వరద నీటిని 65 రోజుల్లో నిల్వ ఉంచి బ్రహ్మంసాగర్‌కు పంపాలనే అంచనాలు వేశారు. దీని కోసం విద్యుత్ సరఫరాకు 43.7 ఎండబ్ల్యు వెయిర్‌హైట్ 3.85 ఎంటి, లెన్త్ 370 ఎంటీ, అప్రోచ్ ఛానెల్ 300 మీటర్లు పొడవున్న తెలుగుగంగ మెయిన్‌కెనాల్‌కు సరఫరా చేసేందుకు అంచనాలు వేశారు. కానీ ఇంత వరకు ఈ పనులు ఊపందుకున్న పాపాన పోలేదు. దాదాపు 54.38 ఎకరాల భూములకు నష్టపరిహారం అందించాలని, ఇందులో మరో 18 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని గుర్తించారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయి ఉంటే వెలుగొండ ద్వారా వచ్చే నీటి కన్నా నాలుగునెలలు ముందుగానే సప్లిమెంటరీ వరదలతో వచ్చిన నీరు వృథా కాకుండా నిల్వ ఉంచు కుని నియోజకవర్గ ఆయకట్టుకు నీరందించే అవకాశాలున్నాయి. కానీ గత పాలకుల నిర్లక్ష్యంతక్ష ఐదేళ్లుగా సర్వేలతోనే కాలం వెల్లబుచ్చారు. వర్క్‌మాత్రం టెండరు అయి లిఫ్ట్‌ఇరిగేషన్ పనులు త్వరగా పూర్తి చేసి బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుకు 8 టీఎంసీల నీరు నిల్వ ఉంచుకునే అవకాశం కల్పించి రైతాంగాన్ని ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై తెలుగుగుగంగ ఈఈ క్రిష్ణారెడ్డిని వివరణ కోరగా కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు టెండర్లు జరిగాయి. సర్వే కూడా జరిగిందని, ల్యాండ్ అక్విజేషన్ సంబంధించి రైతులకు ప్రభుత్వం డబ్బు అందించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితే పనులు చేయించడానికి యంత్రాంగం సిద్ధమవుతుంది. కొత్త ప్రభుత్వంలో అయినా ఈ కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం కావాలని రైతులు ఎదురు చూస్తున్నారు.



కుందూ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల సర్వే నిర్వహిస్తున్న అప్పటి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఫైల్)

ప్రభుత్వం ఆదుకోవాలి



తెలుగుగంగ కాల్వ కింద ఐదెకరాల్లో చీనీ చెట్లు సాగు చేశాను. మూడేళ్లుగా తెలుగుగంగ కాల్వకు నీరు పారక చెరువుకు నీరు చేరక తాను వేసిన బోరు బావిలో నీరు అడుగంటుతోంది. చీనీ చెట్లకు నీరుపారుదల తగ్గుతుంది. కావున తెలుగుగంగ కాల్వ పూర్తి చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

బత్తల వెంకటసుబ్బయ్య, రైతు, కొండూరు

వరద బాధితులకు కానిస్టేబుల్ రూ.50 వేలు వితరణ



దస్తగిరి రాజును సన్మానిస్తున్న సీఐ జావిద్

కడప (క్రైం), సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులకు ట్రాఫిక్ కానిస్టేబుల్ దస్తగిరి రాజు రూ50వేల చెక్‌ను అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడ నీటిలో మునిగిన విషయం తెలిసిందే వరద బాధితులకు తమవంతు సహాయం అందించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా దస్తగిరి రాజు (పీసీనెంబర్ 2903) రూ50వేల చెక్‌ను అందజేశారు. సీఐ జావిద్ అయనను ట్రాఫిక్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. సీఐ దస్తగిరి రాజును అభినందించారు.

నేటి నుంచి దేవుని కడపలో పవిత్రోత్సవాలు

కడప (కల్చరల్) సెప్టెంబరు 14: తిరుమల తొలిగడప దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి 18వ తేదీ బుధవారం వరకు స్వామివారి పవిత్రోత్సవాలు కన్నుల పండువగా జరుగనున్నాయి. ఏడాదికో సారి జరిగే పవిత్రోత్సవాల్లో మొదటిరోజు సాయంత్రం 6 గంటలకు అంకురార్పణం, విశ్వక్ సేన పూజ, పుణ్యామవాచనం, అనుంగ రక్షాబంధనం, అఖండ దీపారాధన, జరుగనున్నాయి. 16న ద్వారా తోరణ, నిత్యహోమం, 17న పవిత్ర సమర్పణం, పవిత్ర హోమాలు, 18న మహా పూర్ణాహుతి, చతుష్టాణ ఉద్వాసనలు, కుంభప్రోక్షణ, పవిత్ర వితరణ, విద్వత్ సంభావన, జరుగనున్నట్లుఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

కొత్తకొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి

వేంపల్లె, సెప్టెంబరు 14: సాంకేతిక విద్య చదువుతున్న విద్యార్థులు కొత్తకొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని ఐబీఎం ప్రతినిధి నాగరాజు తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఐబీఎం స్కిల్‌డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఐదురోజుల పాటు విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన చేపట్టారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం, ఇతర రంగాల్లో ఏఏ ప్రాజెక్టులున్నాయి, ఎలాంటి శిక్షణ పొందితే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న విషయాలను తెలియజెప్పారు. వినూత్నంగా ఆలోచించి కొత్త ప్రయోగాలుచేసే విద్యార్థులకు విరివిగా అవకాశాలు ఉంటాయని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లను ప్రదానంచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్, డీన్ రత్నకుమారి, వినోద్ పాల్గొన్నారు.

బి.మఠం విద్యార్థినులకు చాంపియన్ ట్రోఫీ



చాంపియన్ ట్రోఫీ కప్‌ను అందుకుంటున్న బి.మఠం విద్యార్థినులు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 14: కందిమల్లయ్యపల్లె జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు జెస్సీ, పి.ఉమామహేశ్వరి జంప్‌రోబ్ చాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించారు. నియోజకవర్గం స్థాయిలో విజయం పొంది నంద్యాల జిల్లా పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికై మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో నిర్వహించిన 21వ సబ్ జూనియర్ జంప్‌రోబ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో 30 మంది విద్యార్థులు ఛాంపియన్ ట్రోఫీలో పాల్గొన్నారని పీడీ పి.పుష్పలత తెలిపారు.

సైక్లింగ్ పోటీలకు మోడల్ స్కూలు విద్యార్థులు

వల్లూరు, సెప్టెంబరు 14: ఏపీ మోడల్ స్కూలు ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ విద్యార్థినులు డి.మమత, ఎస్.పూజిత, టైం ట్రైలర్లో, నిత్య శ్రీ, ఎన్.దివ్యసాయి మార్షల్ సైక్లింగ్‌లో ఎంపికయ్యారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి అశోక్‌గౌడ మార్షల్‌లో మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు.

చదువుతో పాటు సమాజ జ్ఞానం పొందాలి

- లోకాయుక్త, ఆర్ట్సకళాశాల పూర్వవిద్యార్థి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి



జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డిని సన్మానిస్తున్న వైవీయూ వీసీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: విద్యార్థులకు సమాజ జ్ఞానం అవసరం. చదువు సహా పాఠ్యేతర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లోకాయుక్త, ఆర్ట్సకళాశాల పూర్వవిద్యార్థి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ ఆర్ట్సకళాశాల ప్లాటినం జూబ్లీ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో పీయూసి డిగ్రీ చదివానని, విద్యార్థి యూనియన్ చైర్మన్‌గా క్రియాశీలకంగా వ్యవహరించానన్నారు. సమాజంలో జరిగే సంఘటనలపై కూడా ఆ రోజుల్లో స్పందించాం, నా ఎదుగుదలలో మా గురువుల పాత్ర చాలా గొప్పది. చాలకాలం తరువాత చదివిన కళాశాలకు రావడం పెద్ద అనుభూతినిచ్చింది. పాత మిత్రులను కలవడానికి అవకాశం కల్పించిన ప్లాటినం జూబ్లీ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ కృషిని ప్రశంసించారు. వైవీయూ వీసీ క్రిష్ణారెడ్డి రాయలసీమలాంటి కరువు సీమలో ఈ కళాశాల ఎందరో విద్యార్థులను గొప్పగొప్ప స్థాయికి పంపిందంటే నాటి గురువుల అంకితభావం, క్రమశిక్షణ గొప్పదన్నారు. కారణాలు అన్వేషించాలని మేధావులు రోడ్‌మ్యాప్ తయారు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. విశ్రాంత ప్రిన్సిపాళ్లు సుబ్బిరెడ్డి, జనార్ధనరెడ్డి, ద్రవిడ యూనివర్శిటీ ప్రొఫెసరు కరీముల్లా పాల్గొన్నారు.

వినాయకుని ఊరేగింపులో అపశ్రుతి

- ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి



కడప (క్రైం), సెప్టెంబరు 14: కడప నగరం అశోక్ నగర్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టర్ కింద పడి చెరువు పల్లి మధు (29) మృతి చెందినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కడప బుడ్డాయపల్లికి చెందిన మధు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి వినాయకుడి ఊరేగింపులో మధు ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య నాలుగేళ్ల కుమార్తె ఉంది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

మైలవరానికి నీటి విడుదల పెంపు

కొండాపురం,సెప్టెంబరు 14: గండికోట నుంచి మైలవరం జలాశయానికి శనివారం నీటి విడుదలను పెంచారు. శుక్రవారం 2500 క్యూసెక్కులు విడుదల చేయగా దానిని 5000 క్యూసెక్కులకు పెంచినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోటలో 25.5 టీఎంసీల నీటిమట్టం స్థిరంగా ఉండేలా అనుబంధ జలాశయాలకు నీటిని పంపుతామని డీఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 9700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఆయన తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మద్యం తాగుతున్నాడనీ....

● తండ్రి మందలిస్తే యువకుడు ఆత్మహత్య

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 14: మద్యం తాగవద్దని తండ్రి మందలించాడని చింతకుంట వెంకట్(18) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం చోటు చేసుకున్న ఘటన వివరాల్లోకెళితే.. స్థానిక సుందరయ్యనగర్ యువకుడు చింతకుంట వెంకట్ ఫొటో స్టుడియోలో పనిచేస్తున్నాడు. ఇటీవల తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో తండ్రి మందలించాడు. దీంతో వెంకట్ ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించడంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ విష్ణునారాయణ కేసు నమోదు చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, సెప్టెంబరు 14: దప్పెర్ల గ్రామం వద్ద బిజ్జం శివారెడ్డి (65) ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దముడియం మండలం కొండసుంకేసుల వాసి శివారెడ్డి కోవెలకుంట్లలో అద్దె ఇంట్లో ఒక్కడే నివాసం ఉండేవాడు. అనారోగ్యంతో ఇటీవల కర్నూలులో చికిత్స పొందాడని బంధువులు తెలిపారు. శనివారం కొండలో విష ద్రావణం తాగి పడిపోయి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం కొండసుంకేసులలో బంధువులకు అర్బన్ పోలీసులు తెలియజేశారు.

కంప్యూటర్ ఆపరేటర్ రూ.2.56 లక్షలు స్వాహా

చాపాడు, సెప్టెంబరు 14: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ హనిక్‌బాష బద్రిపల్లె పంచాయతీలో రూ2.56 లక్షలు స్వాహా చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. జనవరి నుంచి పలు విడతలుగా 15వ ఫైనాన్స్ నిధులను ఇతరుల బ్యాంకు ఖాతాల్లోకి పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం భద్రిపల్లె సర్పంచ్‌గా గుత్తి మల్లీశ్వరి ఉన్నారు. హనిక్‌బాష స్వాహా చేసిన నిధులను మూడు రోజుల్లో రికవరీ చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ సీజ్

కొండాపురం,సెప్టెంబరు 14: బెడుదూరు వద్ద పోలీసులు ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. చిత్రావతి నది నుంచి శనివారం ఇసుక ను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గండికోటను సందర్శించిన కలెక్టర్



అడ్వెంచర్ భవనంలోని సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జమ్మలమడుగు, సెప్టెంబరు 14: పర్యాటక ప్రాంతం గండికోటను కలెక్టర్ లోతేటి శివశంకర్, ఇతర అధికారులు సందర్శించారు. శనివారం గండికోటలో ఓబెరాయ్ హోటళ్లకు గత ప్రభుత్వం కేటాయించిన స్థలాలను, ఆ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి గుర్రపుశాలను, జుమ్మా మసీదు, తదితర ప్రాంతాల్లో సందర్శించారు. అనంతరం సాయంత్రం గండికోట అడ్వెంచర్ భవనాల్లో సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27న పర్యాటక ఉత్సవాలను పురస్కరించుకుని గండికోటలో అభివృద్ధిపై చర్చించారు. పర్యాటకులకు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కోట ఎదురుగా స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కొందరు కోరినట్లు తెలుస్తోంది. అయితే సమావేశంలో గండికోట పరిసర ప్రాంతం చుట్టూ అభివృద్ధికోసం పర్యాటకుల కోసం పార్కులు, వాహనాల పార్కింగ్, ఎంట్రీ టిక్కెట్లు, గుర్రపుశాల తదితర ప్రాంతాలపై చర్చించారు. గండికోట లోయ పక్కన ఉన్న టెంట్లకు అనుమతులు ఉన్నాయా లేదా అన్న దానిపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అనధికారికంగా వేస్తున్న టెంట్లకు, బాడుగ రూములకు పంచాయతీ అభివృద్ధి కోసం కొంత డబ్బు వసూలు చేసి గ్రామం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, స్థానిక అధికారులు చర్చించినట్లుగా తెలుస్తోంది.

చుట్టూ రోడ్లు ఏర్పాటు చేయాలని వినతి

నియోజకవర్గంలో ప్రధాన పర్యాటక ప్రాంతం గండికోట. గండికోటకు పర్యాటకులు అనంతపురం, కర్నూలు, హైదరాబాదు, చెన్నై, దూర ప్రాంతాల నుంచి అధికంగా వస్తున్నారు. ఆ విధంగా గండికోటను కనెక్టివిటీ రోడ్లు చుట్టుపక్కల వేయాలని జమ్మలమడుగు ప్రాంత సీనియర్ న్యాయవాది మురళీధర్‌రెడ్డి, కాంట్రాక్టర్ ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి, ఈశ్వర్, తదితరులు కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి

ప్రతిభావంతులకు బంగారు పతకాలు ● 75 వసంతాల వేడుకలో పూర్వవిద్యార్థులు



కేరళ టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ కె.శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, పూర్వవిద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14: విద్యాబుద్ధులు వినయ సంపన్నత నేర్పి జీవితమంటే ఏమిటో అవగాహన కల్పించి సమాజంలో గౌరవంగా బతికేలా తయారు చేసిన ప్రభుత్వ ఆర్ట్సకళాశాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో ఉద్ఘాటించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు బంగారు పతకాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. శనివారం కడప నగరం ఆర్ట్స కళాశాల 75వసంతాలు పూర్తి చేసుకుని ప్లాటినం జూబ్లీ ఉత్సవాల ముగింపు సమావేశంలో పూర్వవిద్యార్థి కేరళ టూరిజం డిపార్టుమెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులంతా ఒకటిగా తయారై ఇప్పటికీ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కళాశాలను దీర్ఘకాలం తరువాత చూస్తూనే నాటి రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. ఏపీ విశ్రాంత డీజీపీ లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ డబ్బు సంపాదించాక దానిని సామాజిక అవసరాలకు వెచ్చించాలని, ఫలితంగా జీవన కాలం పెరుగుతుందన్నారు. హిమాచల్ ప్రదేశ్ విశ్రాంత కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఎ.రెడ్డి మాట్లాడుతూ పేదల కళాశాల ఆర్ట్స్ కాలేజీ అని, ఎందరో నాలాంటి వారికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చిందన్నారు. ఇక్కడ టీచర్ల అంకితభావం నిబద్ధత గొప్పదన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివి తే ఏమవుతారంటే ఇలా సివిల్ సర్వెంట్ అవుతారని చెప్పాలన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్‌శ్రీనివాసరెడ్డి మాట్లాడు తూ ఈ కళాశాలలో చదివిన వారు విభిన్నరంగాల్లో రాణించాలని ఉదహరించారు. కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం ద్వారా నిధులు ఖచ్చితంగా తెప్పించి ప్రగతి దిశగా తీసుకువెళతామన్నారు. విశ్రాంత మున్సిపల్ కమిషనర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీకాం కోర్సులో ప్రతిభావంతులకు బంగారు పతకం కోసం ఏటా 50వేలు ఇస్తానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ వెంకటశివారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ చదువు నేర్పిన కళాశాలకు ఎమ్మెల్సీగా కొంత రుణం తీర్చుకున్నానన్నారు. హైదరాబాదు ప్రఖ్యాత రచయిత ఉషారాణి మాట్లాడుతూ గుప్పెడంత మనసు అనే టీవీ సీరియల్‌లో రుషి క్యారెక్టరును నాటి అధ్యాపకుడు కథగా తీసుకుని రాశారంటే ఆ రోజుల్లో అధ్యాపక ఆదర్శనీయ జీవితం ఎంత గొప్పగా ఉందో చెప్పుకోవచ్చన్నారు. చైతన్యకెమికల్స్ అధిపతి రామ్మూర్తి, ఎస్కే యూనివర్శిటీ ప్రొఫెసరు ఎంఆర్‌కె రెడ్డి నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కళాశాల ప్రతిభావంతుల కోసం శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డుగ్రహీత బీవీ ఎల్ఎస్ ప్రకాశ్ రూ.2లక్షలు ప్రకటించారు. పూర్వవిద్యార్థులను కళాశాల తరపున ప్రిన్సిపాల్ ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్వీ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రారు, కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సమన్వయకర్త ప్రొఫెసరు రాజశేఖర్ రెడ్డి, అలుమ్ని కార్యదర్శి కె.శివరాం, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అంగరంగ వైభవంగా శ్రీరంగనాథుని కల్యాణం


కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 14 :పులివెందులలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో శనివారం శ్రీరంగనాథ, శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కొట్టె వెంకటరమణ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి క్రిష్ణ రాజేశ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు నగరి కుమార్ రాజసింహ, ఫణి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు. చల్లా వంశీయుల ఆధ్వర్యంలో వారి సహాయ సహకారాలతో చల్లా చంద్రశేఖర్ ఆదిలక్ష్మి దంపతులు కూనమనేని వెంకటరత్నం, సంగీత దంపతులు, చల్లా క్రిష్ణమూర్తి ఆదిలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని కల్యాణం జరిపించారు. అంతకు ముందు శ్రీరంగనాథస్వామి వారికి ఉదయం అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించి పులకించారు. సాయంత్రం శ్రీరంగనాథ స్వామి వారిని గజవాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ వెంకటరమణ, మాజీ చైర్మన్ ఒనిడా సుబ్బారెడ్డి, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ తిరుమలశెట్టి వెంకటనాగేంద్రప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కాంబోజి మల్లికార్జున, రాంరెడ్డి తదితరులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, హాల్ గంగాధర్, చంద్రమౌళి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, శ్రీరంగనాథ ట్రస్టు చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, ఆర్యవైశ్య యువజన నాయకులు మేడం దినేష్‌కుమార్, గుప్తా, రంగ గుప్త, నరసింహ గుప్త, పులివెందుల డిప్యూటీ సర్వేయరు ఇన్‌స్పెక్టరు నాగరాజు, ఏపీ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 14: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో అనేక రోగాలు దరిచేరవని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య సూచించారు. శనివారం తొండూరు బీసీ బాయ్స్ హాస్టల్‌లో వార్డన్ ఫరూక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత, భోజనం చేసే ముందు చేతులు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే ఎక్కువగా నులిపురుగులు కడుపులో చేరి అనేక రకాల వ్యాధులు కలగజేస్తాయన్నారు.ఈ నులిపురుగులు శరీరలోచేరితో రక్తహీనత, తగిన బరువు, ఎత్తు లేకపోవడం, ఎదుగుదల లేకపోవడం, జ్ఞాపకశక్తి లోపించడం, విరేచనాలు, కడుపునొప్పిలాంటి జబ్బులు సంభవిస్తాయన్నారు. వీటి నివారణకు అల్బెండాజోల్ మాత్రలు వాడడం,మరుగుదొడ్డి వాడడం, బహిరంగ మలవిసర్జన పాటించకపోవడం, చేతులు శుభ్రత, పండ్లు,కాయకూరలు, ఆకుకూరలు కడిగిన తర్వాత తినడం ద్వారా,చెప్పులువేసుకొని తిరగడం ద్వారా నిర్మూలిచవచ్చు అన్నారు. వంటగదిని, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వార్డన్ ఫరూక్, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పుల్లమ్మ, కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లను కొనసాగించాలి: ఏఐఎస్ఎఫ్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14:పులివెందుల మెడికల్ కళాశాలకు ఎంసీఐ ద్వారా కేటాయించిన సీట్లను తిరిగి కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, అధ్యక్షుడు శివశంకర్ డిమాండ్ చేశారు. శనివారం క డప అంబేడ్కర్ సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందులకు మెడికల్ కళాశాల రావడంతో దానికి ఎంసీఐ ఈ సంవత్సరం 50 ఎంబీబీఎస్ సీట్లను కేటాయించిందన్నారు. అయితే ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడం బాధాకరమన్నారు.పులివెందుల మెడికల్ కళాశాల సీట్లను భర్తీ చేయడం వల్ల రాష్ట్ర విద్యార్థులకు మంచి అవకాశమని వచ్చినట్లన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, తేజా, చంద్ర, రాజేశ్, అశోక్, అభిరానంద్ తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ సవరణ చట్ట బిల్లును ఎదుర్కోవాలి'

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 14: వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ఉభయ పార్లమెంట్లలో (లోక్‌సభ-రాజ్యసభ) వీగిపోయేలా తెలుగుదేశం, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఎదుర్కోవాలని సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. శనివారం స్థానిక చిలకలబావి వీధిలో గల తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్న 5 సంవత్సరాల పాలనలో సదరు చట్టాన్ని ఉపయోగించి ఎన్ని భూములు స్వాధీనం చేసుకున్నారో బహిర్గతం చేయాలని కోరారు.

రేపటి నుంచి మిలాదున్ నబీ ఉత్సవాలు

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 14: కడప నగరంలోని మిలాద్ కమిటీ కార్యాలయంలో మిలాదున్ నబీ ఉత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఉత్సవాల కమిటీ ప్రెసిడెంట్, మాజీ మంత్రి హాజీ మహ్మద్ అహ్మదుల్లా, వైస్‌ప్రెసిడెంట్ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, జాయింట్ సెక్రటరీ షేక్ నయీం ఆధ్వర్యం లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న సోమవారం సాయంత్రం నగరంలోని రహ్మతుల్లా వీధిలో ఉన్న మిలాద్‌ఘర్‌లో జష్నే మీలాదున్‌నబీ ఆధ్యాత్మిక సభ ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యఅతిథులుగా కదిరి నుంచి సయ్యద్ షా మీర్ ఖాద్రిషామిరిసాహెబ్ సభ అధ్యక్షత వహిస్తారని, కార్యక్రమంలో మత గురువు మౌలానా మౌల్వి ముఫ్తి సయ్యద్ అహ్మద్ బాక్విసాహెబ్ పాల్గొంటారన్నారు. ప్ర ముఖ కవులు కూడా పాల్గొంటారన్నారు. కావున ముస్లిం సోదరులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు.

గండి అన్నదానానికి విరాళం


దాతలకు పత్రాన్ని అందిస్తున్న ఏసీ

చక్రాయపేట, సెప్టెంబరు 14: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.50,116 విరాళాన్ని అందించారు. శనివారం సింహాద్రిపురం మండలం కాంబల్లె గ్రామానికి చెందిన ముల్లుకుంట్ల వెంకటనాగిరెడ్డి, చిన్న పుల్లారెడ్డి ఈ విరాళాన్ని అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందించి, శేషవస్త్రం, స్వామివారి చిత్రపటాన్ని అందించి వేద ఆశీర్వచనం అందించినట్లు తెలిపారు.

నాపై స్టాఫ్ నర్సు అసత్యారోపణలు చేస్తోంది: డాక్టర్ చిన్నిక్రిష్ణ


మాట్లాడుతున్న డాక్టర్ చిన్నిక్రిష్ణ

కడప (క్రైం), సెప్టెంబరు 14: కడప రిమ్స్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న చిన్నమ్మ తనపై అసత్య ఆరోపణలు చేస్తోందని అన్నమయ్య జిల్లా రాజంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చిన్ని క్రిష్ణ పేర్కొన్నారు. కడప నగరం క్రిష్టియన్ లైన్‌లోని కృష్ణ హాస్పిటల్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను కమలాపురంలో పనిచేస్తున్న సమయంలో చిన్నమ్మ పరిచయమైంది తప్ప ఆమెను తాను పెళ్లి చేసుకోలేదన్నారు. తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. నష్టపరిహారంగా రూ.50 లక్షలు డబ్బు డిమాండ్ చేసిందని, అందుకు తాను స్పందించకపోవడంతో ఇలా కుటుంబ సభ్యులపై తప్పుడు ఫిర్యా దు చేస్తోందని, చిన్నమ్మపై న్యాయస్థానంలో ఫిర్యాదు చేస్తానన్నారు.

సీఎం, ఎక్సైజ్ శాఖా మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

కడప (క్రైం), సెప్టెంబరు 14 :వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో (సెబ్) రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెబ్ రద్దు కావడంతో ఎక్సైజ్ లక్ష్మణ్‌దాస్ తన సిబ్బందితో కలిసి శనివారం సీఎం చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ మినిస్టరు కొల్లురవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తొలగించి ఆ స్థానంలో యదావిధిగా ఎక్సైజ్‌ను పునరుద్ధరించడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని సీఐ లక్ష్మణ్‌దాస్ పేర్కొన్నారు.

భక్తులతో గండి క్షేత్రం కిటకిట


అంజన్న దర్శనం కోసం క్యూలైన్లలో నిల్చున్న భక్తులు

చక్రాయపేట, సెప్టెంబరు 14: ప్రసిద్ద గండి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ వ మా సంలో మొదటి శనివారాన్ని తలపించేలా భక్తులు వచ్చారు. ఉదయం నుంచే క్యూలైన్లలో భక్తులు నిలబడి దర్శనం కోసం వేచి ఉన్నారు. సర్వదర్శనం మూడునాలుగు గంటల సమయంపట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏసీ వెంకటసుబ్బయ్య అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధానఅర్చకులు రాజారమేష్‌లు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గండి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. గండి దేవస్థానం ఆధ్వర్యంలో రెండువేల మందికి అన్నదానం చేశారు. గండికి వచ్చిన భక్తులు పాపాఘ్నిలో స్నానాలు చేసి దర్శనానికి క్యూలైన్లలో నిల్చున్నారు.

'సాంస్కృతిక వారధి హిందీ: ఆర్‌యూపీపీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14 :హిందీ భాష పాత, కొత్త తరాల మధ్య సాంస్కృతిక వారధి అని, దీని సాహిత్యం వారసత్వ సంపద అని ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ తెలిపారు. శనివారం కడప నగరం సీపీ బ్రౌన్ గ్రం థాలయంలో జాతీయ భాష హిందీ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు.ముందుగా రాజేంద్రసింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశలా అధ్యాపకుడు రమేశ్‌యాదవ్ మాట్లాడుతూ హిందీ భాష ప్రపంచానికి అనివార్యమైన ఆవశ్యకతగా మారిందన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధికి హిందీ అవసరమన్నారు. అనంతరం ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల అధ్యాపకులు జయంతి, హిందీభవన్ వ్యవస్థాపకుడు కేఎస్ ఫర్హతుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసురేశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు గంగిరెడ్డి, ఖాదర్‌బాషా, వర ప్రసాదరెడ్డి, జిలానీ, బాబయ్య, రవీంద్రరెడ్డి, కరీముల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 132 కేసులు పరిష్కారం

కమలాపురం రూరల్, సెప్టెంబరు 14 : కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 132 కేసులు పరిష్కారం అయినట్లు న్యాయమూర్తి లావణ్య తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల పరిష్కారం కోసం రాజీమార్గం మేలన్నారు. రా జీకి వచ్చే కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చూపెడుతున్నామన్నారు. సివిల్ 14, క్రిమినల్ 93, ఎంసీ 1, ఇతర కేసులు 24 పరిష్కారం అయినట్లు తెలిపారు. ఇందులో రాజీకి రాబడిన సివిల్ క్రిమినల్ కేసులు మా త్రమే పరిష్కారం చేస్తామన్నారు. క్షణికావేశంలో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఓర్పుతో సహనంతో ఉన్నప్పుడు ఏ సమస్య రాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అన్నదమ్ముళ్ల పొలం గట్ల స్థల వివదాలు కేసులు ఉన్నాయని ఈ కేసులను ఊరిలోనే పరిష్కరించుకుంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. న్యాయవాదులు రవీంద్రప్రసాద్, పుష్పరాజ్, నారాయణరెడ్డి, నాగభూషణం, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం

కడప (క్రైం), సెప్టెంబరు 14 :కడప నగరంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ట్రాఫిక్ పోలీసు సీఐ డీకే జావీద్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల ప్రభావం గురించి అవగాహన కల్పించడానికి వాల్‌పోస్టర్లు అంటించారు. ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధు లు ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. యువత మాదకద్రవ్యాలపై అధికంగా ఆధారపడుతున్నారని, దీనివల్ల సమాజంలో వివేకం కోల్పోతున్నారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై పోస్టర్ల ద్వారా ప్రజలను అరికట్టడం ఆనందదాయకమన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు.

'ప్రభుత్వ నిబంధనలు ప్రైవేటు పాఠశాలలకు వర్తించవా'

పులివెందుల టౌన్, సెప్టెంబరు 14: పులివెందులలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు రెండో శనివారం సెలవు అయినప్పటికీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూలు నడపడం ఏమిటని వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌లక్ష్మణ్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్రరెడ్డి ప్రశ్నించారు. వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14:ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున తెలిపారు. శనివారం ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ వేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఫలితం లేకండాపోయిందన్నారు. ప్రస్తుత సీఎం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపై వెంటనే స్పందించి పీఆర్సీ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, ఎం.గంగరాజు, జిల్లా కార్యదర్శి కె.గంగాధర్ పాల్గొన్నారు.

'లంచాలు తీసుకునేవారిపై చర్యలు తీసుకోండి'

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 14: లంచాలు తీసుకునే కొందరు కడప, కర్నూలు, నెల్లూరు, అనంతపురం జిల్లాల రవాణా శాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప ఆర్‌అండ్‌బీ స్టేట్ గెస్ట్ హౌ స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూ రు, కడప జిల్లాలలోని సిమెంట్ ఫ్యాక్టరీలోని సిమెంట్, అలాగే తాప విద్యుత్ కేంద్రాలలో విడుదలయ్యే ఫ్లైయాష్‌ను భారీ లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు (తమిళనాడు- కర్ణాటక) అధిక లోడ్‌తో తరలిస్తున్నారని ఆరోపించారు. ఆయా ఫ్యాక్టరీల అధికారులు కుమ్మక్కై పరిమితికి మించి లారీలకు, బల్కర్‌లకు లోడింగ్ చేసి తరలిస్తున్నార న్నారు. దీన్ని కట్టడి చేయాల్సిన రవాణా శాఖ అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటు పడి తనిఖీలకు మంగళం పాడుతున్నారన్నారు.

సింహాద్రిపురానికి రెగ్యులర్ వ్యవసాయాధికారిని నియమించండి

సింహాద్రిపురం, సెప్టెంబరు 14: సింహాద్రిపురానికి రెగ్యులర్ వ్యవసాయాధికారిని నియమించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయాధారిత మండలంలో రెగ్యులర్ వ్యవసాయాధికారి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వ్యవసాయ శాఖ అధికారిగా శివమోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా నుంచి డిప్యూటేషన్‌పై సింహాద్రిపురంలో విధులు నిర్వహించేవారు. ఎన్నికల సమయంలో డిప్యుటేషన్ రద్దు కావడంతో ఆయన మళ్లీ విజయనగరం జిల్లాకు వెళ్లారు. అప్పటి నుంచి వ్యవసాయశాఖ వారు సింహాద్రిపురానికి రెగ్యులర్ వ్యవసాయాధికారి ఊసే ఎత్తకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కనిపించని వ్యవసాయ కార్యాలయం

గత ప్రభుత్వంలో ఉన్న వ్యవసాయ కార్యాలయాన్ని కూల్చేశారు. వ్యవసాయ కార్యాలయం లేకపోవడంతో గతంలో ఏఓ రైతులకు కనిపించడం గగనమైంది. ఆయన ఉండటానికి మండల కేంద్రంలో ఆఫీసు లేకపోవడంతో ఆర్బీకేలలో ఉంటూ కాలం వెలిబుచ్చారు. రైతులు వ్యవసాయాధికారిని కలవాలంటే ఎక్కడికి వెళ్లాలో ఎవరికీ తెలీదు. సింహాద్రిపురానికి కార్యాలయం, రెగ్యులర్ వ్యవసాయాధికాని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వివేకానంద స్కూల్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన వివేకానంద స్కూల్ విద్యార్థులు

సింహాద్రిపురం, సెప్టెంబరు 14: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు సింహాద్రిపురం శ్రీవివేకానంద హైస్కూల్ విద్యార్థులు టి.హరీష్, ఇ.ప్రవీణ్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. సెప్టెంబరు 13వ తేదీన 68వ ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయి అండర్ 19 రగ్బీ ఎంపికలు గండిలోని గురుకుల పాఠశాలలో జరిగాయి. ఎంపికైన హరీష్, ప్రవీణ్‌లు కడప జిల్లా రగ్బీ జట్టులో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఖాదర్‌వలి, డైరెక్టర్ కేఎం జాఫర్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

17 నుంచి స్వభావ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత

పులివెందుల రూరల్, సెప్టెంబరు 14: స్వభావ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత ప్రచార కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం 17వ తేదీ గాంధీ సర్కిల్ వద్ద మానవహారం ఉంటుందన్నారు.

బలిజ ఆత్మీయ సమావేశం వాయిదా

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 14 : బలిజ ఆత్మీయ సమావేశం వాయిదా వేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. శనివారం హరిటవర్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ వరదల వల్ల ప్రజాప్రతినిధులు బిజీగా ఉన్నారన్నారు. కావున ఈ నెల 22న జరగాల్సిన సమావేశం వాయిదా వేశామన్నారు. సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

'అనారోగ్యం వల్ల పది రోజులు గడువు ఇవ్వాలి'

కడప (క్రైం), సెప్టెంబరు 14: హోంమంత్రి, కడప ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో అసభ్యకర పదాలతో పోస్టింగ్‌లు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్ బాషాకు చిన్నచౌకు పోలీసులు 41ఏ నో టీసు అందించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శనివారం విచారణకు రావాల్సి ఉండగా న్యాయవాది ద్వారా ఆయన గడువు కోరారు. ఆరోగ్య సమస్య వల్ల పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు చిన్నచౌకు సీఐ తేజ మూర్తి తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం

జమ్మలమడుగు, సెప్టెంబరు 14: పెండింగ్ కేసుల కక్షిదారులు సమస్యలను పెంచుకోకుండా జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని, రాజీ మార్గం రాజమార్గమని జడ్జి భార్గవి అన్నారు. శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం కేసులు 721 పరిష్కారం కాగా రూ.63,13,584 రికవరీ అయినట్లు లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, పోలీసు అధికారులు దస్తగిరి, లింగప్ప, గోపాల్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఎస్ఐలు, సీఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్...: లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. మొదటి బెంచ్ సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, రెండో బెంచ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.జాతీయ లోక్‌అదాలత్‌లో 352, క్రిమినల్ కేసులకు గాను రూ.15,29,143 రూపాయాలకు పరిష్కారం కాగా 12 సివిల్ కేసులు 24లక్షలా 16వేల 101 రూపాయలు పరిష్కారం అయిందని కోర్టువర్గాలు తెలిపాయి. జాతీయ లోక్‌అదాలత్‌లో కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.


జమ్మలమడుగు కోర్టులో కేసులు విచారిస్తున్న జడ్జి భార్గవి

నులి పురుగుల నివారణ అందరి బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 14 : నులి పురుగుల నివారణ అందరి బాధ్యత అని వైద్యాధికారి హిమబిందు అన్నారు. శనివారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం వైఎంఆర్ కాలనీలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ సుబ్బారెడ్డి, చెన్నమ్మ, రమణమ్మ, గంగాభవాని, ఆశాలు పాల్గొన్నారు.

17న ఎమ్మెల్యే, ఎంపీ రాక

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 14 : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఆయన కుమారుడు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ 17న వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలిపారు. ఆరోజు బ్రహ్మంసాగర్ ప్రాజెక్టును సందర్శించి రైతులకు ఎడమకాల్వ నుంచి నీటిని విడుదల చేస్తారన్నారు. కాగా శనివారం బ్రహ్మంసాగర్ కట్ట, రోడ్డుపై ఉన్న కంప చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కార్యక్రమంలో చిలమల నాగయ్య, మేకల సుధాకర్, మస్తాన్, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాషా క్లబ్‌లతో భాషలు బలోపేతం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 14: భాషా క్లబ్‌లను ఏర్పాటు చేయడం వలన భాషలు బలోపేతం చేయడానికి దోహదపడుతాయని కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎన్జీవో హోంలో ది ఇంగ్లీష్ క్లబ్‌ను ప్రారంభించి లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంగ్లం క్లబ్ ఏర్పాటు వలన విద్యార్థుల్లో ఇంగ్లీషు భాష పట్ల అభిరుచి పెరిగి ఆ భాషను నేర్చుకుంటారన్నారు. ఇంగ్లీష్ క్లబ్ అధ్యక్షుడు రఫిక్‌ఖాన్ మాట్లాడుతూ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఆంగ్ల క్లబ్ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు అయిన 15 మంది ఇంగ్లీషు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అప్సర్ , ఇంగ్లీష్ క్లబ్ కార్యదర్శి సుశీల, ఉపాధ్యక్షుడు ప్రభుకుమార్, కోశాధికారి శివప్రసాద్, ప్రసాద్, రామసుబ్బయ్య, ఇబ్రహీం, రమణారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఇంగ్లీష్ క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ముద్దనూరు సెప్టెంబరు14: కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు.మండల పరిధి నొస్సంవారిపల్లెలో సాగు చేసిన కంది పంటను శనివారం ఏవో పరిశీలించారు.మండలంలో 1538 ఎకరాల్లో కంది సాగు చేశారు.కందిలో కలుపు లేకుండా అంతర కృషి(సేద్యం)చేసుకోవాలని సూచించారు.కందిలో రసం పీల్చు పురుగు ఆశించకుండా ముందస్తుగా వేప నూనె ఒక లీటరు నీటిలో 5ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు.తేమ శాతం ఉన్నప్పుడు ఎరువుల విత్తుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది పవన్‌కుమార్, రైతులు నాగమునిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రామాంజనేయరెడ్డి,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కందిలో సేద్యాన్ని పరిశీలిస్తున్న ఏవో

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

ఖాజీపేట, సెప్టెంబరు 14: ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సీఐ మోహన్ అన్నారు. శనివారం వాహనాల తనిఖీల్లో భాగంగా లైసెన్సు, హెల్మెట్ లేనివారి వాహనాలను పట్టుకుని రూ.3 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు.

వైభవంగా పాలేటి గంగమ్మ జాతర

ముద్దనూరు సెప్టెంబరు14: ముద్దనూరు మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని కందుకూరు రోడ్డులో వెలిసిన పాలేటి గంగమ్మ వద్ద జాతర నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జాతర కార్యక్రమం నిర్వహిస్తారు.5 సంవత్సరాలకు ఒక సారి మండలంలోని యాదవులు చందాలు వేసుకొని గంగమ్మకు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.గంగమ్మ తల్లి మొదట అక్కడ వెలిసినట్లు ,అందువల్ల జాతర నిర్వహిస్తుంటామని యాదవ సంఘం వారు తెలిపారు. మండలం నుంచి భారీ ఎత్తున యాదవులు జాతరకు తరలివెళ్లారు.అందులో భాగంగా శనివారం గంగ జాతర గురించి కథ, గంగవేశధారణ,బొల్లేవుల యుద్ధం,పలు కార్యక్రమాలు నిర్వహించారు.ఆదివారం ఉదయం అమ్మవారికి పూజా కార్యక్రమాలు, జంతు బలి నిర్వహించడం జరుగుతుందన్నారు.


పాలేటి గంగమ్మ మూలవిరాట్

రైతుల కోసం నీటి పైపు ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 14 : మండలంలోని మల్లేపల్లె గ్రామ పంచాయతీ చెరువుకు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతన్నలు మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డికి తెలిపారు. ఆయన వెంటనే చెరువు పై భాగాన బ్రహ్మంసాగర్ నుంచి ఎడమ కాల్వ ఉండడంతో పైపును చెరువుకు అనుసంధానం చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో శనివారం పనులను చేయించినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో బ్రహ్మంసాగర్ నుంచి ఎడమకాల్వకు నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.

మురుగుగా మారిన పంటకాలువ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 14 : పంట కాలువ మురుగుకాలువగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి రవి అన్నారు. పోరుమామిళ్లలోని ఓ ప్రైవేటు స్కూలు వెనుకభాగాన పోరుమామిళ్ల మండలం నుంచి రంగసముద్రం చెరువు వెళ్లే పంట కాల్వను కొందరు పూడ్చి వేయడంతో నీరు అంతా నిల్వ ఉండి మురుగుకాలువను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు పంట కాలువను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.


మురుగుకుంటను చూపిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూ దేవాలయాల పరిరక్షణకు కృషి చేయాలి

అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 14 : రాష్ట్రంలోని హిందూ దేవాలయాలు ,సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. శనివారం బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని స్థానిక కమ్మసత్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం కార్యకర్తలకు శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా పీఠాధిపతి విరజానందస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ దేవాలయాలు, హిందువులపైన అనేక దాడులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అలాగే సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని హిందూ సమాజం అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యవాహ్‌ఎస్ ప్రసాద్, సహప్రాంత ప్రచారక్ జనార్దన్, ప్రాంత ప్రచారక్ రామ్‌నాయక్ జిల్లా,మండల స్థాయి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు.


మాట్లాడుతున్న పీఠాధిపతి విరజానందస్వామి

కొనసాగుతున్న గణనాథుని నిమజ్జనం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 14: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయకుల నిమజ్జనం కొనసాగుతోంది. శనివారం ఉదయం గణనాథులకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గజమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం కొన్ని కమిటీల నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వినాయకులను ట్రాక్టర్లలో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.


నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మూడురోజుల జైలు శిక్ష

కాశినాయన సెప్టెంబరు14: డ్రంక్ అండ్ డ్రైవ్‌కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు శనివారం బద్వేల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి గాయిత్రీదేవి 3రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు పోరుమామిళ్ళ సీఐ డి. శ్రీనివాసులు తెలిపారు. సీఐ వివరాలమేరకు శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కొండపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి ఆటోలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి వారికి 3 రోజులు జైలు శిక్ష ఖరారుచేస్తూ తీర్పు ఇచ్చారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అట్లూరు కేజీబీవీ విద్యార్థులు ఎంపిక

అట్లూరు, సెప్టెంబరు 14: రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు 8 మంది కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి, పీఈటీ ప్రేమ తెలిపారు. అండర్ 19 జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో వీరిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. హ్యాండ్‌బాల్, నెట్ బాల్, బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా ఆటలకు ఆదెమ్మ, సుహాసిని, మస్తాని, జగదీశ్వరి, జయతి, లక్ష్మీప్రసన్న, సుప్రజ, స్పందన ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



పోక్సో,కిడ్నాప్ కేసు నమోదు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు, 14: ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె గ్రామపరిధిలోని లక్ష్మీనారాయణ అనే యువకుడిపై పోక్సో కిడ్నాప్ కేసు నమోదైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. 15 సంవత్సరాల బాలికను ప్రేమ పేరుతో వివాహం చేసుకుంటానని తీసుకెళ్లాడు. ఈవిషయం బాలిక కుటుంబ సభ్యులకు తెలియడంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

కాశినాయన సెప్టెంబరు14: కాశినాయన మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా కౌన్సిలర్ కే.జోజయ్య తెలిపారు. పోరుమామిళ్ళలో జరిగిన యూటీఎఫ్ విస్తృత స్థాయి సమావేశంలో అధ్యక్షుడుగా బుసిరెడ్డి భాస్కర్‌రెడ్డి (కొండ్రాజుల్లె ఆర్‌సీఎం పాఠశాల ఉపాధ్యాయుడు) ,ఉపాధ్యక్షులు జి.జయంవమ్మ,ఏ.నాగవంణి, ప్రధానకార్యదర్శి ఎస్.గురప్ప, కోశాధికారిగా వి.సుగుణరావు,గౌరవఅధ్యక్షుడుగా కే.ఆనందరావు,మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశామన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు ఓ.బాలశోభన్‌కుమార్, ఎస్.ప్రసాద్, ఎస్‌బి.రవికుమార్ పలువురు ఆడిట్ కమిటీ సభ్యులు,ఎన్నిక కమిటీ సభ్యులు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బి.భాస్కర్‌రెడ్డి(అధ్యక్షుడు), ఎస్ .గురప్ప(ప్రధాన కార్యదర్శి)

రేషన్ బియ్యం పట్టివేత

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 14 : పట్టణంలోని శ్రీరాముల పేట సర్కిల్లో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 14 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. రేషన్‌బియ్యంతో సహా ఆటోను త్రీటౌన్ పోలీసు స్టేషనుకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండాపురం,సెప్టెంబరు 14: వెంకయ్యకాల్వ వద్ద పోలీసులు ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పొట్టిపాడు వద్ద నున్న చిత్రావతి నది నుంచి శనివారం ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి తెలిపారు.